# దాటుతాడి

శ్రీ కవికొండల వేంకటరావు

ఊరిపేరేదైతేం - ఊరు, ఊరావల ఏరు, ఏరవల ఊర్లంకపొలం, పొలంలో బలరామరాజు ఇల్లు, వ్యవసాయం, పాడి, పంట, కాపరం, వ్యాపారం, - ఇన్నెందుకు చదవడం - పొలమే బలరామరాజు, బలరామరాజే పొలం: ఊళ్లోకి బలరామరాజు వెళ్లినజాడే అరుదు.

బలరామరాజు అంటే ఎవరో ఏవర్ణపు మనిషో కాదు: పిసలైన క్షత్రియ కుటుంబీకుడు. అతని భార్య పేరు కామయ్య. రాజుకూ కామయ్యకూ సంతానం ఎనమండుగురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలూను. ఆడపిల్లలందఱూ అత్తవారిళ్లకు కాపరానికి వెళ్లిపోయినారు. మగపిల్లలు వొకడుత్తర పొలాన్ని, వొకడు దక్షిణ పొలాన్నీ, వొకడు మెరక పొలాన్నీ, వొకడు పల్లపుపొలాన్నీ ఇలా సర్దుకుని అందఱూ కంచతాలుమీద పెత్తనం వహించుకున్నారు. ఇంటిపట్టున ఊర్లంక మెట్టను బలరామ కామయ్యా దంపతు లిద్దరుమట్టుకే వుండడం పరిపాటి.

పొలంలో ఇల్లని చుట్టుగుడిసె వెయ్యలేదు రాజు. మహాపెద్ద భారీభవనం కట్టాడు. భవనానికి తగ్గ పెరడు ప్రాంగణం వుంచాడు. సింహద్వారానికిటూ అటూ చక్కటి నున్నని నల్లటి నిగనిగలాడే గచ్చు అరుగులు, ఎంతమంది వచ్చి కూర్చున్నా ఇబ్బంది లేదన్నట్టు తయారు చేయించాడు. ఆ అరుగులే చాలు ఇంటియొక్క రాజభోగం చాటి చూపించడానికి.

ఓ శుక్రవారప్పొద్దులాగుంది, బలరామరాజు, వేసంగికీ శీతకట్టుకూ దోసందుగోజుల్లో, కుడిసెంపు అరుగుమీద అప్పుడే దంతధావనం గావించుకు, ఉత్తి మామిడాడ చెంబుమీద చెయ్యి ఆంచుకుంటూ చెంబు చేతపట్టుకు లేచినాడు, తనాబీ ఎత్తుకూ!

వాకిటలోకి 'పింగళసిద్ధాంతి' అనుపేర బరగే బ్రాహ్మణు డొకాయన వచ్చి "రాజా! లోపలకు వెళ్లిపోకు. ఆ చెంబు ఎంతకొన్నావు? బంగారపుదా ఇత్తడిదా?" అన్నాడు. రాజు "తంవరే చిత్తగించండి!" అని ఆ బ్రాహ్మణునకు నమస్కారమైనా పెట్టకుండా, బ్రాహ్మణ్ణి కూర్చోమనైనా కనుసంజ్ఞ కానీకుండా, ముంగిటనున్న బ్రాహ్మణునకు తానరుగుమీద వుండే ఆలా అందిచ్చాడు, తన చేతిలోని మామిడాడచెంబును. సిద్ధాంతి అందుకుంటూ ఆలా యీలా చెంబు చూచి "మాడు! రాజా! ఇది నాకిచ్చివేస్తివా వడ్డీ క్రింద రెండు రూపాయలు జమ కట్టించినవాడ వవుతావు!" అని రాజు సెలవును ఎటకారంగానే అడిగినాడు గావున, రాజు సెలవు ఇవ్వకుండానే ఆ చెంబు చేతపట్టుకుపోయినాడు సిద్ధాంతి.

రాజు మాట్లాడలేదు. మీసం దువ్వుకుంటూ నట్టింటిలోకి వెళ్లిపోయినాడు. రాజుభార్య కామయ్య రాజును చూస్తూనే "ఏవండీ! చెంబేం చేశారు? మామిడాడచెంబు? దానీది తోమడానికి కనిపెట్టు కూర్చుంది" అంది. రాజు "పింగళసిద్ధాంతి పట్టుకుపోయినాడు" అని ఓనికమైన రిత్తచూపు చూచాడు. కామయ్య "వానికేం పొయ్యేకాలం వచ్చింది. ఇయేల శుక్కురోరప్పొద్దు. పైపెచ్చు అది మా పుట్టింటూరు సారెతో పెట్టిన చెంబు. మీ కిట్యాలని ఎలా బుద్ధి పుట్టింది. పింగళసిద్ధాంతి అంటే ఎవడు? ఎందుకు వచ్చాడు? వానితో మీ కేం పని?" అంది. బలరామరాజు "అసలు ఈభూమీపుట్రా ఇదంతా ఎలా వచ్చింది అనుకున్నావు? పింగళసిద్ధాంతి బదులివ్వబట్టే! నేనేం గొప్ప తవ్వి గొయ్యి తవ్వి మిగిల్చిచచ్చానా ఏనాడైనా? ఆ డిచ్చాడు, నేతెచ్చాను. విన్నావు? విన్నావుటే?" అన్నాడు ఘట్టిగా మండువామీది ఆకాశం మాఋమోగేటట్టు. "అంతడబ్బు ఆయన కివ్వడానికి ఆ సిద్ధాంతి కెలా

వచ్చింది?" అని అడిగింది కామయ్య, మెళ్లో మేలిం మిరియాల పేరు సవరించుకుంటూ. "ఎరగవంటే! అంతా మఱచిపోయినావు? మన పెళ్లిలో సదస్యసంభావన కోసం, ఓ గిడ్డసిద్ధాంతి లిక్కిలా నడుం వేసుకు, గుద్దు లాడాడు! వానికి పెద్దలు పెళ్లిచేసిన యీ వెనక పెద్దల మీద కోపం వచ్చి కాశీ పాఱిపోయినాడు. ఆరోజుల్లో గంగలో నిలబడి యిలా సెయి సాపితే బాపనయ్యలకు పైనుండి కనకవర్షం కురిసేదట! దోసిట్లో పోసీవారట మొహరీలు కాసులూ విశ్వేశ్వరుణ్ణి చూడవెళ్లిన యాత్రీకులు. ఆలా సంపాదించిన సంపాదన అంతా యీసిద్ధాంతియుండాక్కడుకు ఇక్కడకు పెళ్లాం పేరట మని ఆర్డరు కట్టి, ఆడబ్బు నావొక్కడికే బదులిమ్మని పెళ్లాంకు వుత్తరాలు వ్రాశాడు. పెళ్లాం నన్నోరోజున కబురంపించి సంగతి చెప్పి, "రాజా! నీవల్లను ప్రోనోట్లు వ్రాయించుకుని నీకే యిమ్మన్నారు బదులుగా మా ఆయన గరణ అంతాను. మళ్లీ యిస్తావో యెగబెడతావో బాగా ఆలోచించుకుని, తెల్లవాఱిగట్ల రా! వెయ్యి రూపాయలకు ప్రోనోటు వ్రాసి తీసుకురా!" అంది. అంటే ఏదో వైకుంఠం వొలికిందని భావించి మనమామిడాడ చెంబుచ్చుకు ఆతెల్లవాఱిగట్ల వెళ్లి ఆవెయ్యికి ఆమె చెప్పినట్లు నోటు వ్రాసి యిచ్చి తెచ్చాను. తీసుకు వచ్చి వెంటనే కొన్నపొలమే ఉత్తర పొలం. మఱి నెల్లాళ్లకు మఱో వెయ్యి, మఱి మూణ్ణెల్లకు మఱో వెయ్యి యిలాగ్గా ఏభైవేలు పట్టుకొచ్చాను: ఎలా తెస్తేం. వేఱే రూపాయలు లెక్కపెట్టడం లేదు. నీ మామిడాడ చెంబునిండా పోసేది ఆ యిల్లాలు రూపాయీలు, వెయ్యిరూపాయీలూ నా లెక్కకు టకీమని సరిపోయీవి. ఆలా చెంబు వెత్తిలేకుండా పడమటావుహా లట్టుకొచ్చినట్టు పట్టుకొచ్చి కొన్నాను సుక్షేత్రఖండికలు దక్షిణపొలం, తూర్పు పొలం, చెప్పన్నపొలాలు మన కిప్పుడున్న రెండువందల యెకరమూను —". కామయ్య వింటూ "ఆ ముండా బ్రాహ్మడు మళ్లా రా డనుకున్నారా? వళ్లా డబ్బు అడగ డనుకున్నారా?" బలరామరాజు "మనిషి అయినవాడు ఎవడూ అలా అనుకోడు. ప్రతీవాడూ తాను తెచ్చిన అప్పు తీర్చి వేదామనే ఊహిస్తాడు. తీర్చగలననే అనుకుంటాను. అయితే కాలమానం తనులడిపోతే బ్రహ్మదేవుడుమాత్రం ఏం చేయగలడు? ఎకరం రెండువేలుపెట్టి కొన్న బంగారంలాంటిభూమి యిప్పుడు రెండువందలు చెయ్యడం లేదు. కొనబోతే కొరవి అమ్మబోతే అడవిగానూ వుంది. మఱీన్నీ ధాన్యంధర, అపరాలధర సగానికి సగం తగ్గిపోయింది. పన్నులబాధ హెచ్చిపోయింది. అయినా యీ ఘడియదాకా తీరుద్దామనే సదుద్దేశ్యంతోటే వున్నాను" — అని పళ్లు పటపటకొఱికినవాడై, లోపలి త్రుళ్లు పైకి వెళ్లబుచ్చుతూ ఇలా అన్నాడు. "కాని యిప్పుడు ఆ వెధవ! ఆ దరిద్రప్పీనుగు! పీనుగుమీద డబ్బు లేరుకునే పీనాసి! వాడు నాచేతిలోని నిక్షేపంలాంటి చెంబు పుచ్చుకొని వడ్డీక్రింద జమకట్టుకుంటానన్నాడే! ఆఘడియలో నామనస్సు మాఱిపోయింది. చెంబు ఎలా వడ్డీక్రింద జమకట్టుకుంటాడో మాస్తాను" అన్నాడు. "జమకట్టుకు ఇంట్లో వుంచుకుంటాడా? యింటింటా తిరిపె మెత్తుకునేవాడు కాడూ ఆ బ్రాహ్మడు? నా చెంబు చేతపట్టుకు తిరిగాడా అంటే మనపరువు ఎక్కడుంటుందో? అదికూడా కుసింత యోజించండి మీరు" అంది కామయ్య.

"ఆలోచిస్తూనే వున్నాను. అన్నీ ఆలోచిస్తూనే వున్నాను" అంటూ ఆరుబయట పెఱట్లోకి వెళ్లిపోయినాడు మీసం దువ్వుకుంటూ బలరామరాజు.

పెఱట్లో యిద్దఱు మాలవాళ్లు పాలేళ్లు చింత చెట్టొకటి పడిపోయిందంటే దాన్ని వంట చెరుగ్గా చెలుపుతూ వున్నారు. వాళ్లు కొడుతూవుంటే తాను ఎండవెచ్చ కూర్చున్నట్టు కడగా వోతుమ్మదుంగమీద కూర్చుని ఏదో ఆలోచిస్తూ వున్నాడు బలరామరాజు. అతనికి వచ్చిన ఆదురహంకారానికి మఱి మేర లేదనుకోవలసిందే. అతని చూపెంతసేపూ అక్కడ పనిచేస్తూ వున్న గొడ్డళ్లమీద, పనికి సిద్ధంగావున్న గునపం, పార, పోటికత్తి యిత్యాదులమీదికే వుఱకలేస్తూవుంది కాని అహింసాస్థాయిని కనిపించే ప్రకృతిలోని పువ్వుం మీదికిగాని పత్రంమీదికిగాని పోవడంలేదు. కూర్చుని కూర్చుని లేస్తూ మాలపాలేళ్లను ఇద్దర్నీ "మాలపొలం చేనిగట్టుకు గొడ్డళ్లతో సాయంకాలం రాండ్రా!

మీ రిద్దఱూ మఱచిపోకుండా!" అని ఆజ్ఞాపించి మీసం దువ్వుకుంటూ యింట్లోకి వెళ్లిపోయినాడు. కాలు కాలినపిల్లిలా వొళ్లు తెలీకుండా తిరుగుతూవున్నాడు బలరామరాజు నాడు నట్టింట సందెగుమ్మాలు తుడిచే వేళదాకా.

భార్య కామయ్య అప్పటి కప్పుడే చాటుగా దాసీదానిచేత తన పుట్టింటూరింటికి కబురెట్టింది;. తన అన్నగారైన "వెలుగేశ్వరరాజు"ని వెంటనే ఎనభైవేల రూపాయలు తీసికొని రావలసినదిగా వర్తమానించింది. ఈ సంగతి కించిత్తూ బలరామరాజు ఎఱగడు. భర్త ముఖం చూస్తే మాట్లాడ శక్యంగాకుండా వుంది. ఏమి చెప్పినీ ప్రయోజనం లే దనుకుంది రాచముత్తైదువ.

* * *

అక్కడ అనగా ఊరిలో తనయిల్లు చేరుకుని పింగళసిద్ధాంతి తా జేసిన ఘనకార్యాన్ని భార్యతో చెప్పినవాడై, భార్య చేతికి తాను తెచ్చిన మామిడాడ చెంబు ఇచ్చి దాన్ని పరిశుభ్రంగా వన్నె వచ్చేటట్టు తోమమన్నాడు. భార్య ఆ చెంబు తీసికొని "యింట్లో తోమి వున్న చెంబులు పనికిరావు? ఇప్పు డిది తోమి యిచ్చేదాకా అంత హాజరుజవా బేమొచ్చె?" అంది. అని తెచ్చిన చెంబు చూచి, దానిమీద కామయ్యపేరు పోల్చిందై, "బలరామరాజుగారి కామయ్యగారి చెంబులావుందే ఇది? ఇది మీ చేతిలో కెట్లా వచ్చింది? ఆమె బాగా వుందా?" అని అడిగింది. సిద్ధాంతి "బాగుండకేం! దీర్ఘసుమంగలి ఆపె! మేలిం మిర్యాలపూస లేసుకుని తలు పోరగా నన్ను చూచి తలు పేసుకుంది. ఆమెకేం? ఆమె బాగానే వుంది" అన్నాడు. "అయితే యీ చెంబు మీ కెలా వచ్చింది? బలరామరాజు ఇచ్చాడా? అని అడిగింది. "ఇస్తాడూ వాడై? నే పట్టుకొచ్చాను. నే నెత్తుకొచ్చాను. నాకు పదివేలకు పైగా వడ్డీ యివ్వవలసిన వాడు వొక్కరాగిపైసా యివ్వకుండావుంటే, వొళ్లు మండిపోయి పుల్లాక్కొచ్చాను. ఏం! ఆలా మిడుతూ మిడుతూ చూస్తావు? నీకు నచ్చలే నాచర్య" అన్నాడు పింగళసిద్ధాంతి. "అవునులేండి, పట్టుకు వెళ్లినప్పుడు" చెంబు పరికిస్తూ చేతిలో తిప్పుకుంటూ– "దీంతోనే కొల్చిచ్చినట్టు పట్టుకెళ్లేరు రూపాయలు ఆరాజుగారు!" "రాజుగా రంటావు! నీ కింకా రాజులంటే మోజు పోలే. మొద్దుముండకానా! యింకా తోమావా లేదా చెంబు? ఈచెంబుచ్చుకు ఊరంట ముష్టెత్తి అందఱికీ చాటిస్తా ఫలానావాళ్లది యీ చెంబు" అని అన్నాడు భర్త. భార్య "శాంతించండి" అంది. అని ఇంకా బోధించింది ఇలా: "నిన్నను పత్రికలు చూచికూడా ఔఘూ యిత్యంగోకి దిక్కండి. రాజుగారు వ్రాసియిచ్చిన నోట్లన్నీ ౧౯౩౧ లోవి ౧౯౪౯ లోవీని. ఆయన వల్ల మనకు వడ్డీ దమ్మిడీ రాదు. నేను ఆయన భార్యతో మాట్లాడి మీకు అసలుకు ట్టేటట్టు చేస్తాను. ఇది నాపూచీ! పాపం! ఈచెంబుమీద ఆయిల్లాలు పే రుంది చూచారా! మఱి మీరు నన్ను ఏమనుకున్నా సరే! మీరు కాశీలో వున్నన్నాళ్లూ నాకు ఆమె ఆమెమగడే దిక్కయ్యారు. వాళ్లపరువు తీసెయ్యకండి" అని బతిమాలు మొగంవేసింది. పింగళసిద్ధాంతి "మఱి అల్లాగవితే, రెండోకంటివానికి తెలియకుండా నే నెల్లా తెచ్చానో చెంబు, ఆలాగ్గా చెంబు మళ్లీవాళ్లకు ఈ రేత్రి వొప్పచెప్పిరా! అసలు నీ వేలా యిచ్చావో ఎంత యిచ్చావో అంత సొమ్ము ఆలా పట్టుకురా!" అన్నాడు సిద్ధాంతి. అని పాతా కొత్తా దూతగళ్ల దళసరి తాటాకు చాపమీద జములుగుప్పటీ తన్ని పెట్టుకు పడుకున్నాడు.

* * *

దీపదీపాలవేళే సిద్ధాంతిభార్య రాచవారి చెంబు చేతపుచ్చుకుని ఆలా ఆలా ఏరు దాటి ఊరలంక చేల గట్లంట బలరామరాజుగారి లోగిలి చేరుకుంది. బలరామరాజుగారు ఇంటివద్ద లేరు. కామయ్యసోదరుడు అప్పటి కప్పుడే కావళ్లమీద ఎనభైవేలరూపాయలు మోయించుకు లోగదిలో దింపించి లెక్కస్తూవున్నాడు. సోదరి అతగానికి తనమగని అప్పుయొక్క యావద్వృత్తాంతం నచ్చచెబుతూ వుంది. బ్రాహ్మణి– "రాజుగారు ఇంట్లో వున్నారా?" అన్నగొంతు విని "ఎవరు వారు?" అంది కామయ్య. "నేను పింగళవారికోడల్ని" అంది సిద్ధాంతిభార్య. అని "మీ మామిడాడచెంబు మతిపోయి మా యింటాయన ఈ యుదయం మీ వారిచేతిలోంచి తీసికొన్నారట. మీ కిచ్చివేయడానికి వచ్చాను" అంది.

తన సారెచెంబు తిరిగి వచ్చిందని వినీవినడంలో కామయ్య హెచ్చరిల్లింది. "అన్నయ్యా! ఉండు!" అని సోదరుణ్ణి ఆపి, వీధితలుపు తీసింది. తీసి "మీరేనా సిద్ధాంతిగారి భార్యగారు? మీరే వచ్చారా కష్టపడి యీ రాత్రిపూట, ఏరు అందిందా?" అని అడిగింది కామయ్య. "ఇప్పటికి అందుతూనేవుంది, మఱీపయిని అందదేమోగాని. ఇదిగో తల్లీ! మీ మామిడాడచెంబు. ఇదిగో మీ పేరు. చూచుకోండి. కొత్తగా వచ్చిన "రైతుఋణనివారణచట్టం"ను గుఱించి నిన్న విన్నప్పటినుంచీ మావారికి మతిపోయింది. అసలు సొమ్మైనా దక్కుతుందో లేదో అని వెఱ్ఱిసందేహంలో పడి ఇలాంటి ధూర్తప్పని చేసినారు. క్షమించండమ్మా! ఇది మీసారె చెంబుగా తోస్తుంది" అంది, చెంబు కామయ్యకు అందిస్తూ.

"దానికేంగాని మీరు సమయానికి పట్టుకొచ్చారు చెంబు. ఈ చెంబుతో నేటగా మీరు కొల్చిచ్చేరటగా మా ఆయనకు అప్పు; మీ రేలా కొల్చి యిచ్చారో ఆలా తీసికోండి. అదేగా యిప్పటి 'లా'" అంది కామయ్య. సిద్ధాంతిగారి భార్య "నే కొల్చి పోసికుంటే వొకటే మీరు కొల్చిపోస్తే వొకటేనా? మీకే కొల్చి ఏపై చెంబులూ పొయ్యండి యీ చెంగులో" అని కొంగట్టింది. "యిక్కడ కాదు గదిలోకి రండి. గదిలో వున్నాయి రూపాయలు - అన్నయ్యా! తప్పుకో" అని కేకేసి సిద్ధాంతిగారి భార్యను ఆలోచన గదిలోకి కామయ్య తీసికొనివెళ్లి రూపాయలరాశి చూపెట్టింది. ఎనభైవేల రూపాయలరాశి చూచేసరికి సిద్ధాంతిగారిభార్య కళ్లు చెదిరింది. ౫౦ వేలు వొళ్లో పోయించుకుంది కొలిపించుకుని, వడ్డీ క్రింద తక్కినవి పోస్తారేమోనని ఎగాదిగా చూచింది సిద్ధాంతిగారిభార్య. "మఱి వొక్క చిల్లిగవ్వ మీకు ముట్టబోదు. మే మేం లేనివాళ్లమని అనుకున్నారా? అయినా మీతో తగువు ఎందుకు దయచెయ్యండమ్మా!" అంది కామయ్య. "ఇదే వడ్డీ! ఇదే అసలు. నా ప్రాణం దక్కించారు అంతే శాన!" అని కొంగులో రాశి ముడేసుకు ఎత్తబోయింది. సిద్ధాంతిభార్యకు కదలలే. అప్పుడు కామయ్య, దూడల్ని విడిచి యిళ్లకు పోయే పాలేళ్లను నలుగుర్ని పురమాయించి సిద్ధాంతిభార్యకు తోడుగా రూపాయలమోతకు వొప్పగించి రాత్రి రాత్రి రెండోకంటికి తెలియకుండా సాగనంపింది. సాగనంపి సోదరునితో ఊసాడుతూ "ఏం? మీ బావ యింకా యింటికి రాలేదు" అని రెండు మూడు తడవ లడిగి "వస్తాడు. రా కేమూ తాడు!" అన్న ప్రతిభావను పూరుకుంటూ వచ్చింది కామయ్య.

* * *

ఊరికీ ఊరలంకకూ మధ్యనువున్న ఏరు రాత్రి రాత్రి నిశిరాత్రికి గట్లుదాసి గట్లపసుళ్లంట ఊళ్లేస్తూవుంది. నక్క లరుస్తున్నాయి. గుడ్లగూబలు "హూమ్ హూమ్" అంటున్నాయి. అతిభయంకరంగా వుంది. ఎక్కడా మనిషి అలికిడిలేదు. మనిషి అలికిడి లేనంతసేపూ ధైర్యంగానే నడిచింది సిద్ధాంతిగారిభార్య, తనకూడా రూపాయలు పట్టుకొస్తూవున్న మనుష్యులను గబగబా నడవండి అంటూ. కాని వొకానొకచోట ఏటివొడ్డే చెట్టుమీద గొడ్డలి పెట్టి కొట్టినట్లు, ఒక్కడు కాకుండా యిద్దఱు రెండు గొడ్డళ్లుచ్చుకు కొడుతూవున్నట్లు వినబడింది. వాళ్లెవళ్లో దొంగలు కావచ్చుననే అనుమానం ఆమెకు తట్టింది. ఆమెకు తట్టి తోటిమనుష్యుల్ని తన వెంపుకు త్రిప్పికుంటూ మఱోదిక్కుగా గట్టెక్కింది. ఏరు అంకాపొంకాలుగా అగపించింది. దిగి వెళ్లడం కష్టం అనుకుంది. అర్ధం ప్రాణంకూడా పోవడమే నను కుంది. మళ్లీ వినిపించింది, తాటిచెట్టు పడకొడుతూ వున్నప్పటి చప్పుడుగా దెబ్బదెబ్బకు చివరాకులు అల్లాడ్డం. "వాళ్లు దొంగలు అని అనుకోవడమేం! మంచి వాళ్లే అని ఎందు కనుకోకూడదు? ఆలాగు వెడితే వారి సాయాన్ని ఏరు దాటొచ్చునేమో?" అని ఊహ మార్చుకొన్నదై తనజనంతో అటువైపు నడచివెళ్లింది సిద్ధాంతి భార్య.

గొడ్డళ్ల చప్పుడు వినబడ్డవైపునకు వెళ్లినకొద్దీ చప్పుడు తగ్గి మనుష్యులు మాయమైపోయినట్లయి, ఒకానొక తాటిచెట్టుమాత్రం ఏటి కడ్డంగా సరిపడా, ప్రేళ్లల్లోకంటా పెల్లగింపునఱుకు నఱికబడి కూలద్రోయబడి అగపించింది. "ఇదెవరో మనకోసమే నఱికి దాటుగా పడేసినట్లున్నారు, అమ్మా!" అని కూడా

వున్న రూపాయల మూటవాళ్లు అంటూవుంటే ఆమె వాళ్లతోకూడా ఆదాటుతాడిమీదుగా ఏరు దాటి ఊరు చేరుకుని తన యింటిసుమ్మం మెట్లు ఎక్కింది. కూడా వున్నవాళ్లను "రూపాయల మూటలు ఆలా దించుకోండి" అంటూవుంది.

* * *

ఇంటిలోపల రెండు గొడ్డళ్లతో ఇద్దఱు మనుష్యులు ఒకమనిషిని తలకు తలా కాళ్లకు కాళ్లా తెగనఱుకుతూ "మామిడాపెచెంబు! ఎక్కడుంచావు! చావు! సిద్ధాంతీ! చచ్చావురా!" అని అన్నట్లుయింది.

"అమ్మబాబ్యో! ఇంకేముంది? దొంగలొగ్రో! దొడ్డితోవ కాయండగ్రోయి! నా మొగుణ్ణి నరికిపారేశారగ్రో!" అని పెద్దబొబ్బ పెట్టి సొమ్మసిల్లిపోయింది వెఱ్ఱిబ్రాహ్మణి ఆమెకూడా వచ్చిన యీవలి మనుష్యులు ఇల్లు చుట్టూ ముట్టడేసి కాసి పట్టుకున్నారు దొంగల్ని. పట్టుకొని "ఓరి మీరుట్రరా! మా మనుష్యులేనుట్రరా!" అని పలకరించారు. "మీరుటండీ! మా మనుష్యులేనుటండీ!" అని దొంగలు వీళ్లను పలకరించారు.

"ఏటివంచ తాడి పడగొట్టుకు అడ్డంగా దాటుకు వెళ్లింది మీరేనుట్రరా!" అంటే దొంగలు "మేమే? బలరామరాజుగారు నఱికెయ్యమంటే నఱికేశాం" అన్నారు. అని మళ్లీ "మనిషినా? చెట్టునా! ఖామందుగారు నఱికెయ్యమన్నది" అని గుర్తింపుకు దెచ్చుకొని, నలుగురు, ఇద్దఱు మొత్తం ఆరుగురుపాలేళ్లు కలిసి అమాంతంగా పడగొట్టిన తాటిచెట్టును పైకెత్తి నిలబెట్టారు ఎప్పట్లా తెల్లాఱగట్టుకు.

కాని ఆ చెట్టు మళ్లీ వ్రేళ్లు నాటుకోలేదు. సూర్యరశ్మికి తలెండిపోయి దానంతటదే బాహాటమైన దాటుతాడిగా ఏటి కడ్డంగా శాశ్వతంగా రెండోసారి పడిపోయింది.

---



అనుకొన్నదానికంటె

నా వెండ్రుకల అందము ఎక్కువైనది.

నిత్యము కామినియా నూనె వాడినందున కలిగినఫలితమే ఇది.

యదార్థమైన సౌందర్యము...నిగనిగలాడు పైమెరుగు...సహజముగాఏర్పడు వంపులు...మరియు వెండ్రుకల రంగు మీరు వాడే నూనెపై ఆధారపడియుండును.

పోషణకు, పెరుగుదలకు, రంగుకు అనుకూలించు పదార్థము లుండిన కామినియా నూనె మాత్రమే మీ వెండ్రుకల అందమునకు తోడ్పడును.

కొబ్బెరనూనె మొదలగు నూనెలలో సువాసన పదార్థములు, అత్తరు మున్నగువాటిని చేర్చు తదితర నూనెలకు, కామినియా నూనెకు పోలిక ఏమాత్రము లేదు. అత్తరుచేర్చిన నూనెలవలన మీ వెండ్రుకలకు అనుకూల ఫలితముండదు. మీదు మిక్కిలి హాని కలుగును.

విలువగల వనమూలికలతో తయారైన కామినియా నూనె (రిజిస్టర్డు) మీ వెండ్రుకలకు తప్పక అనుకూల ఫలితమును చేకూర్చును. ప్రస్తుతము దీనిని వాడుచుండిన లక్షలకొలదిమందికి కిట్టి అనుకూల ఫలితము కలిగినది.

ఖరీదు సీసా రు 1/-; 3 సీసాలు రు 2-10-0.
వి. పి. చార్జి ప్రత్యేకము. మూడు కానులు స్టాంపు పంపినవారికి సాంపుల్ ఉచితము.

ఆంగ్లో ఇండియన్ డ్రగ్ అండ్ కెమికల్ కంపెనీ, బొంబాయి 2.